సాక్షి రంగారెడ్డి
శుక్రవారం । 16 । జూన్ । 2023



పీఎం హోం ఆధునీకరణ
శిథిలావస్థకు చేరిన చారిత్రక విక్టోరియా మెమోరియల్(వీఎం) స్కూల్ భవనానికి కొత్త సొబగులు సంతరించుకోనున్నాయి. 8లో▸



ఆదర్శంగా నిలుపుతాం
నందివనపర్తి గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా నిలుపుతామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. 8లో▸



బైక్‌కు మంటలు
దుస్తుల బ్యాగ్‌ను బైక్ సైడ్‌కు తగిలించుకొని వెళ్తుండగా సైలెన్సర్ వేడికి మంటలు వ్యాపించి వాహనం దగ్ధమైంది. 8లో▸

న్యూస్‌రీల్

సుస్మితకు డీజీపీ అభినందన



సుస్మితను అభినందిస్తున్న డీజీపీ అంజన్‌కుమార్

షాద్‌నగర్: సివిల్ సర్వీసెస్‌లో జాతీయ స్థాయి 384 ర్యాంకు సాధించిన షాద్‌నగర్ పట్టణానికి చెందిన సుస్మితను డీజీపీ అంజన్ కుమార్ అభినందించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయానికి వచ్చిన ఆమెకు పోలీస్ డైరీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కష్టపడి ర్యాంకు తెచ్చుకోవడం గొప్పవిషయమన్నారు. భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇప్పలపల్లి శ్రీశైలం, లక్ష్మీ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మాల్ చెక్‌పోస్ట్‌లో ఏసీపీ తనిఖీ



పోలీసులకు సూచనలు చేస్తున్న ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు

యాచారం: సాగర్ రోడ్డుపై మాల్ కేంద్రంలో ఉన్న చెక్‌పోస్టును ఇబ్రహీంపట్నం ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. రంగారెడ్డి- నల్గొండ జిల్లాల సరిహద్దులో ఉన్న ఈ చెక్ పోస్టును రెండు జిల్లాల పోలీస్ అధికారులతో కలిసి సందర్శించారు. సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే అనుమానిత వాహనాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట యాచారం, ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ల సీఐలు లింగయ్య, రామాంజనేయులు, నల్గొండ జిల్లా నాంపెల్లి సీఐ విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్టీపీసీతో ఉస్మానియా ఆస్పత్రి ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: వైద్య పరికరాల ఏర్పాటుకు సహకరించే దిశగా ఉస్మానియా జనరల్ ఆస్పత్రితో ఎన్టీపీసీ చేతులు కలిపింది. ఈ మేరకు తమ సామాజిక బాధ్యతలో భాగంగా ఉస్మానియా ఆస్పత్రితో ఒప్పందం చేసుకుంది. ఇది రోగులకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడంలో సహాయపడుతుందని ఎన్టీపీసీ ప్రతినిధులు, ఉస్మానియా ఆస్పత్రి అభివృద్ధి సూపరింటెండెంట్ బి.నాగేందర్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్టీపీసీకి చెందిన సవ్యసాచి పాధి పాల్గొన్నారు.

'అది విష్ణుకుండినుల నాటి వైద్యశాసనమే'

సైదాబాద్: నల్లగొండ జిల్లా పానగల్లులోని మ్యూజియంలో భద్రపరిచిన 5వ శతాబ్దానికి చెందిన రాగి ఫలకం వైద్యశాసనానికి చెందినదిగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ అధికారులు గుర్తించారు. సైదాబాద్‌లోని సంస్థ ఇన్‌చార్జి డాక్టర్ జీపీ ప్రసాద్, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ జి.వెంకటరత్నం బృందంతో గురువారం మ్యూజియంలోని శాసనాన్ని పరిశీలించారు. 5వ శతాబ్దం నాటి విష్ణుకుండినుల వంశానికి చెందిన గోవింద వర్మ రాజు ఎర్రమడలు, పెంకపారు గ్రామాలను జబ్బుపడిన వారికి మందులు సరఫరా చేయడానికి దానం చేసినట్లుగా శాసనంలో వివరించినట్లు అధికారులు తెలిపారు. అధికారుల బృందంలోని నిపుణులు శాసనం ఛాయా చిత్రాలు, ఎస్టాంపేజ్‌లను సేకరించారు. పురాతన కాలంలో రాజులు, చక్రవర్తులు ప్రజారోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారని ఈ శాసనం ద్వారా తెలుస్తోందని సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జీపీ ప్రసాద్ అభిప్రాయపడ్డారు.

ఫైలు కదలాలంటే చేయి తడపాల్సిందే

ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

సాక్షి, హైదరాబాద్: హెచ్ఎండీఏలో అవినీతి బాగా పెరిగిందని, లంచాలు ఇస్తే తప్ప ఫైళ్లు కదలడం లేదని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆందోళన వ్యక్తం చేసింది. ఒకవైపు హెచ్ఎండీఏలో భారీగా ఫీజులు, మరోవైపు పెద్దఎత్తున వసూలు చేస్తున్న లంచాలతో భూముల ధరలు సైతంపెరుగుతున్నాయని పేర్కొంది. హెచ్ఎండీఏలో అడుగడుగునా లంచావతారాలే ఉన్నారని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి తెలిపారు. లంచాలను అరికట్టాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆయన లేఖ రాశారు. 'హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. నగరం చుట్టుపక్కల భూముల ధరలకు రెక్కలొచ్చాయి. సగటు నగర జీవి ఇంటిస్థలం కొనుక్కునే పరిస్థితి లేదు. భూముల ధరలు బాగా పెరగడానికి ఈ లంచాలు కూడా ఒక కారణం' అని లేఖలో పేర్కొన్నారు.

భూ మాయాజాలం!



పహాణీలో ప్రభుత్వ భూమిగా నమోదు



ధరణి పోర్టల్‌లో ప్రైవేటు వ్యక్తుల పేర్లు

రూ.350 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి మాయం

- సేత్వార్, ఖాస్రా పహాణీల్లో తొలుత సర్కారు భూమిగా నమోదు
- ఆ తర్వాత వ్యూహాత్మకంగా పట్టాగా మార్పు
- రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు హెచ్ఎండీఏకు లేఖ
- మాస్టర్ ప్లాన్ జోన్ పరిధి నుంచి తొలగింపు
- కొంగర రెవెన్యూ పరిధిలో వెలుగులోకి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహం ..రెవెన్యూ, అటవీశాఖ అధికారుల సహకారం వెరసి ఏకంగా రూ.350 కోట్లకుపైగా విలువ చేసే సర్కారు భూమికి ఎసరుపెట్టారు. ఏకంగా హెచ్ఎండీఏను ఏమార్చి మాస్టర్ ప్లాన్ మార్చేశారు. అప్పటి వరకు గ్రీన్‌జోన్ పరిధిలో ఉన్న భూములను ఆ తర్వాత ప్రణాళిక ప్రకారం రెసిడెన్షియల్ జోన్ కిందకు తెచ్చారు. సర్కారు భూమిని పట్టా భూమిగా మార్చడమే కాకుండా హెచ్ఎండీఏ అనుమతులతో లే అవుట్ కూడా వేశారు. ఇబ్రహీంపట్నం మండలం కొంగర రెవెన్యూ వేదికగా ఈ భారీ భూ బాగోతం వెలుగు చూసింది.

ఎలా మారింది..?

కొంగరకలాన్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 249లో 1,026.19 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొంత భాగం ఫారెస్ట్ శాఖ పరిధిలో ఉండగా, మరికొంత సర్కారీ భూమిగా నమోదైంది. 1960- 61 నుంచి 1964- 65 వరకు ఖాస్రా, సేత్వార్ పహాణీల్లోనూ సర్కారు కంచెగా ఉంది. దీనిలో కొంత సాగుకు యోగ్యంగా ఉండటంతో స్థానికంగా ఉన్న పేద రైతులు కొన్నేళ్లు వీటిని సాగు చేసుకుంటున్నారు. 1980- 81 నుంచి 1985- 86 వరకు సర్వే నంబర్లు 249, 249/1 మినహా సర్వే నంబర్ 249/2 నుంచి 249/17 వరకు ఉన్న 70.24 ఎకరాలు పట్టా భూమిగా మారింది. 249/1 మాత్రం అలాగే వదిలేసి, ఆ తర్వాత వచ్చిన 249/2 నుంచి 249/17 సర్వే నంబర్లలోని భూమి పట్టాగా ఎలా మారిందనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది.

తక్కువ ధరకు కొట్టేసి..

నిజానికి ఈ భూములు హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లోనూ గ్రీన్‌జోన్ కింద నమోదై ఉన్నాయి. ఇక్కడ ఎలాంటి వాణిజ్య కార్యకలాపాలకు అవకాశం లేదు. కొంత మంది నేతలు, అధికారులు ఓ ప్రణాళిక ప్రకారం రెవెన్యూ రికార్డుల్లో ఉన్న లోపాలను అవకాశంగా తీసుకుని రైతుల నుంచి చాలా తక్కువ ధరకు ఈ భూములను కొట్టేశారు. ఆ తర్వాత తమకున్న అధికారంతో, ఆర్థిక బలంతో రెవెన్యూ, అటవీశాఖల అధికారులను మేనేజ్ చేశారు. అసలు సర్వే నంబర్‌కు అనేక సబ్ డివిజన్లు సృష్టించారు. గ్రీన్‌జోన్ పరిధిలో ఉన్న తమ భూములకు విముక్తి కల్పించాలని కోరుతూ ఆయా శాఖల అధికారులు ఇచ్చిన రిఫరెన్స్ లెటర్లతో హెచ్ఎండీఏకు దరఖాస్తు చేశారు. ప్రభుత్వంలోని పెద్దలు చెప్పిందే తడవుగా హెచ్ఎండీఏ అధికారులు సైతం ఏమాత్రం ఆలోచించకుండా సదరు సర్వే నంబర్లలోని భూమిని మాస్టర్ ప్లాన్ నుంచి తొలగించారు. 249/1లోని భూమి గ్రీన్‌జోన్‌లో ఉంటే.. ఆ పక్కనే ఆనుకుని ఉన్న వివాదాస్పద సర్వే నంబర్లలోని భూములు మాత్రం ఎలా రెసిడెన్షియల్ జోన్‌లోకి మారాయనేదీ అంతు చిక్కడం లేదు.

అనేక అనుమానాలు

అటవీశాఖ తన భూములను నిర్ధారించక ముందే అప్పటి ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏకంగా అవి ప్రైవేటు పట్టా భూములుగా నిర్ధారిస్తూ ఎన్‌ఓసీ పత్రం (16/11/2019) జారీ చేయడం విశేషం. కలెక్టర్ ఎన్‌ఓసీ జారీ చేసిన ఏడాది తర్వాత అటవీ శాఖ(799 ఎకరాలు)గా నిర్ధారిస్తూ రిపోర్టు ఇవ్వడంపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు అప్పటి కలెక్టర్ జారీ చేసిన ఒక ఎన్‌ఓసీపై సంతకం లేదు. మరో ఎన్‌ఓసీపై సంతకం ఉండటం గమనార్హం. ఇలా ఒకే భూమికి రెండు ఎన్‌ఓసీలు ఎలా జారీ చేశారో అంతుచిక్కడం లేదు. అంతే కాదు 2018 ముందు ఆయా రైతుల పేరున ఉన్న పట్టాదారు పాసు పుస్తకాల్లోనూ ఆ భూములు అమ్మడం కొనడం నిషేధం అని రాసి ఉంది. ధరణి వచ్చిన తర్వాత ఈ భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేయలేదు. దీంతో కొనుగోలు దారులు ప్లాన్ ప్రకారం వీటిని పెండింగ్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

తొలుత పెండింగ్ రిజిస్ట్రేషన్

రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ధరణిలో తమ పేర్లు రికార్డు చేయించుకుని, పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన తర్వాత సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి డాక్యుమెంట్లు రిలీజ్ చేసుకోవడం గమనార్హం. ఆయా భూములన్నీ పట్టా భూములే అయితే వాటిని కొనుగోలు చేసిన వారు డాక్యుమెంట్‌ను సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో పెండింగ్ జాబితాలో పెట్టాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది. అంతేకాదు ఇప్పటి వరకు ఆ భూములను అమ్మిన రైతులకు మొత్తం కాకుండా సగం డబ్బులు మాత్రమే చెల్లించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. ఈ భూ కొనుగోళ్లలో ఇటు అధికారులకు, అటు ప్రజాప్రతినిధులకు మధ్యవర్తిగా వ్యవహరించిన ఓ ఉన్నతాధికారి బినామీ పేరున కూడా సుమారు రెండున్నర ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసి ఉండటం కొసమెరుపు.

రైతు సమస్యలను పరిష్కరించాలి



రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కడ్తాల్: దేశానికి అన్నం పెట్టే రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, రుణమాఫీ హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెలలో అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, కనీస మద్దతు ధర చెల్లించాలన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని నినదించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా పాల్గొన్నారు.

పీవీ ఎక్స్‌ప్రెస్ వేపై కారు బోల్తా

రాజేంద్రనగర్: వేగంగా దూసుకువచ్చిన ఓ కారు పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై పల్టీ కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడడం విశేషం. కారు ధ్వంసమైనప్పటికీ అందులో ప్రయాణిస్తున్న ఇరువురికి స్వల్ప గాయాలు కూడా కాలేదు. వివరాల్లోకి వెళితే.. మెహిదీపట్నం నుంచి ఓ క్యాబ్ డ్రైవర్ గురువారం ఉదయం తన కారులో ప్రయాణికుడిని తీసుకుని శంషాబాద్ వైపు వెళ్తున్నాడు. ఎక్స్‌ప్రెస్‌వే పై 215 పిల్లర్ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో పల్టీకొట్టింది. ఈ సంఘటనలో కారులో ఉన్న డ్రైవర్‌తో పాటు ప్రయాణికుడిని స్థానికులు బయటికి తీసి రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు.



ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తుదారుల సందడి

'లక్ష' పాట్లు!

- ప్రభుత్వ చేయూత కోసం కులవృత్తిదారుల అవస్థలు
- ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం పడిగాపులు
- రెవెన్యూ అధికారుల పనితీరుపై ఆగ్రహం

షాద్‌నగర్: ప్రభుత్వం అందించనున్న లక్ష రూపాయల సాయం కోసం కులవృత్తులు, చేతి వృత్తిదారులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో సర్టిఫికెట్ల అందజేత ప్రక్రియ ఆలస్యమవుతోందంటూ ఆగ్రహించిన వీరు గురువారం సాయంత్రం ధర్నా చేశారు.

కార్యాలయాల వద్ద బారులు

ఎలాంటి పూచీకత్తు లేకుండా నాయీబ్రాహ్మణ, రజక, సగర, ఉప్పర, కుమ్మరి, శాలివాహన, అవుసుల, కంసాలి, వడ్రంగి, వడ్డెర, కమ్మరి, కంచరి, మేదర, కృష్ణ బలిజ, మేర, ఆరె కటిక, ఎంబీసీ (సంచార జాతులు) వారికి ప్రభుత్వం లక్ష రూపాయల రుణం అందజేయనుంది. ఈలోన్ పొందేందుకు ఆశావహులు ఆరాటపడుతున్నారు. ఈ బీసీ రుణాలు పొందేందుకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రాలు, తహసీల్దార్ ఆఫీసుల వద్ద బారులుదీరుతున్నారు. ఈనెల 20 చివరి గడువు కావడంతో సర్టిఫికెట్లు అందనివారు ఆందోళన చెందుతున్నారు. కొందరైతే ఉదయం నుంచి రాత్రి వరకు తహసీల్ కార్యాలయాల పరిసరాల్లోనే పడిగాపులు కాస్తున్నారు.

భారీగా అప్లికేషన్లు

క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న తర్వాత.. ఈ వివరాల రశీదులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు అందజేస్తున్నారు. వీటిని పరిశీలించిన తర్వాత కుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను డిప్యూటీ తహసీల్దార్ రెవెన్యూ సర్వర్‌లో అప్‌లోడ్ చేయాలి. అనంతరం మీ సేవ సెంటర్ల నుంచి సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు వారం రోజులు పడుతోంది. కానీ అనేక చోట్ల సరిపోయే మేర సిబ్బంది లేకపోవడంతో ఆలస్యమవుతోంది.

మహిళల ధర్నా

ఆన్‌లైన్‌లో భారీ ఎత్తున దరఖాస్తులు చేస్తుండటంతో అటు మీసేవా కేంద్రాలు, ఇటు తహసీల్దార్ కార్యాలయాల్లో తరచూ సర్వర్ డౌన్ అవుతోంది. దీంతో ధ్రువీకరణపత్రాల మంజూరులో జాప్యం చోటుచేసుకుంటోంది. ఫరూఖ్‌నగర్ తహసీల్ ఆఫీసులోని గదుల్లోకి ఎవరూ వెళ్లకుండా అధికారులు తాళాలు వేశారు. కిటికీలో నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇదిలా ఉండగా పనులన్నీ వదులుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చున్నా పని కావడం లేదని పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తంచేశారు. కనీసం సరైన సమాధానం కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. కొంతమంది అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే సర్టిఫికెట్ల జారీలో ఆలస్యం జరుగుతోందని ఆరోపించారు. ఈమేరకు ఆఫీసు వద్ద కూర్చుని పలువురు మహిళలు నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ దేవకి, ఏఎస్‌ఐ రాంచందర్ అక్కడకు చేరుకుని వారిని సముదాయించారు.

అవస్థలు పడుతున్నాం



ప్రభుత్వం అందజేసే ఆర్థిక సాయం పొందేందుకు దరఖాస్తు దశలోనే అనేక అవస్థలు పడుతున్నాం. తొమ్మిది రోజుల క్రితం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నా. నిత్యం ఎమ్మార్వో ఆఫీసు చుట్టూ తిరుగుతున్నా. ఇప్పటికీ ఇవ్వలేదు.

– జుట్టు బాల్‌రాజ్, ఫరూఖ్‌నగర్

వారం రోజులుగా తిరుగుతున్నా..



కుల, ఆదాయ ధ్రువీకరణ ప్రతాల కోసం వారం రోజుల క్రితం దరఖాస్తు చేశా. పని వదులుకుని తిండీతిప్పలు లేకుండా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. కనీసం సర్టిఫికెట్లు ఎప్పుడు మంజూరు చేస్తారో కూడా సమాధానం చెప్పడం లేదు.

– కమ్మరి సుధాకర్, ఎలికట్ట, ఫరూఖ్‌నగర్

పల్లెలు అభివృద్ధి ముల్లెలు

- గ్రామాల రూపురేఖలు పూర్తిగా మారాయి
- పారిశుద్ధ్యం, పచ్చదనం, విద్యుత్, తాగునీటి వసతులు మెరుగయ్యాయి
- పల్లెప్రగతి దినోత్సవంలో జిల్లా నేతలు

మంచాల: తెలంగాణ పల్లెలు అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం కొర్రవాణితండా, లోయపల్లి గ్రామాల్లో నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవాలకు హాజరై మాట్లాడారు. ఆయా జీపీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ.. 'పల్లె ప్రగతి'తో గ్రామాల రూపురేఖలు మారాయన్నారు. పచ్చదనం, పరిశుభ్రతలో ముందంజలో ఉన్నాయని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు ఉత్తమ సేవా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, ఎంపీపీ నర్మద, ఆయాల గ్రామాల ప్రజా ప్రతినిధులు లక్ష్మి, అనిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేశ్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ అనిత, పలు గ్రామాల నాయకులు, వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పరిస్థితి మారిపోయింది

నందిగామ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లె ప్రగతి' ద్వారా గ్రామాలు పట్టణాలతో పోటీపడే స్థాయికి ఎదిగాయని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నందిగామ సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు హాజరయ్యారు. జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు గ్రామాల పరిస్థితి దారుణంగా ఉండేదన్నారు. అప్పట్లో పల్లెలు అపరిశుభ్రంగా ఉండేవని, తాగునీరు, విద్యుత్ సమస్యలతో జనం సతమతమయ్యే వారని గుర్తుచేశారు. కేసీఆర్ సీఎం అయ్యాక పరిస్థితి మారిపోయిందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు జిల్లెల వెంకట్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్, కో ఆర్డినేటర్ వెంకట్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, ఎంపీటీసీ చంద్రపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ మెక్కొండ కుమార్‌గౌడ్, తహసీల్దార్ రహ్మాన్‌ఖాన్, ఎంపీడీఓ బాల్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ రాములు, ఏఈ కవిత, నాయకులు జనార్దన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, చించేటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పరుగులు

చేవెళ్ల: తెలంగాణ వచ్చిన తర్వాత పల్లెలు అభివృద్ధి పథంలో పరుగులు పెడుతున్నాయని, ఇది సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లె ప్రగతి వేడుకల్లో వారు మాట్లాడుతూ.. గతంలోని పల్లెల్లో పల్లేర్లు పెరిగాయని.. ప్రస్తుతం పచ్చదనం పెరిగిందని తెలిపారు. ఏగ్రామంలోకి వెళ్లినా అభివృద్ధి కళ్లకు కడుతోందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే డప్పుల దరువేస్తూ ప్రకృతి వనాల వద్దకు ర్యాలీగా చేరుకుని, వన భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ యాదయ్య, నాయకులు క్రిష్టారెడ్డి, ఆగిరెడ్డి, టేకుపల్లి శ్రీను, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాజ్‌కుమార్, కార్యదర్శి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. మల్కాపూర్ సర్పంచ్ శేరి శివారెడ్డి ఆధ్వర్యంలో పల్లె ప్రగతి సంబరాలు నిర్వహించారు. ఉప సర్పంచ్ జాఫర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పల్లెల్లో సకల వసతులు

మొయినాబాద్: చిలుకూరులో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాలకు జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, పంచాయతీకి ట్రాక్టర్లు, శ్మశానవాటికలతో అన్ని వసతులు కలిగాయన్నారు. పెద్దమంగళారంలో సర్పంచ్ కోట్ల నరోత్తంరెడ్డి ఆధ్వర్యంలో పల్లె ప్రగతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, ఎంపీడీఓ సంధయ్య, సర్పంచ్ నక్షత్రం, నాయకులు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



కడ్తాల్: దశాబ్ది ఉత్సవాల లోగో రూపంలో కూర్చున్న విద్యార్థులు



చేవెళ్ల: డప్పుల దరువేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య



మంచాల: కొర్రవాణితండాలో జాతీయ జెండాను ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు



మొయినాబాద్: చిలుకూరులో పంచాయతీ కార్మికులతో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి



నందిగామ: పంచాయతీ కార్మికురాలిని సన్మానించి, ప్రశంసపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

ధర్మగిరిలో అన్నదానం

శంషాబాద్: పట్టణంలోని ధర్మగిరి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాకు హారతి పల్లకీ సేవ, హోమం, అభిషేకం చేపట్టారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు బాబాను దర్శించుకున్నారు. సుమారు వేయిమంది భక్తులకు అన్నదానం చేశారు.



సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోం, విశాలమైన పార్కు



అధునాతన గ్రంథాలయం

వీఎం హోం ఆధునీకరణ

- రూ.12 కోట్లతో చారిత్రక భవనానికి నయా సొబగులు
- పురావస్తుశాఖ, హెచ్ఎండీఏ సంయుక్త ఆధ్వర్యంలో పనులు
- అధునాతన గ్రంథాలయం, డిజిటల్ క్లాస్ రూమ్‌లు పూర్తి

హుడాకాంప్లెక్స్: శిథిలావస్థకు చేరిన చారిత్రక విక్టోరియా మెమోరియల్(వీఎం) స్కూల్ భవనానికి కొత్త సొబగులు సంతరించుకోనున్నాయి. పురావస్తు శాఖ, హెచ్ఎండీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈ భవనానికి పూర్వ వైభవం తీసుకురానున్నారు. ఇందుకు రూ. 12కోట్లు ఖర్చు చేయనున్నారు.

పురావస్తు జాబితాలో చోటు

విక్టోరియా మహారాణి జ్ఞాపకార్థం సరూర్‌నగర్ మండల కేంద్రంలో సుమారు 73.3 ఎకరాల విస్తీర్ణంలో 1901లో రెండు అంతస్తులతో కూడిన భవనం (వీఎం హోం) నిర్మించారు. ఇది 1903లో అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ ఒకటో తరగతి నుంచి ఎస్ఎస్‌సీ వరకు ఉచిత విద్యనందిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు ఇక్కడ సుమారు 50వేల మందికిపైగా అనాథలు ఆశ్రయం పొందారు. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. భయాందోళనతో విద్యార్థులు ఇక్కడ ఉండేందుకు జంకుతున్నారు.

దంగు సున్నంతో పనులు

వారసత్వ జాబితాలో చోటు దక్కించుకున్న ఈ చారిత్రక భవనాన్ని కాపాడుకోవాలని పురావస్తు శాఖ నిర్ణయించింది. ఆ మేరకు పునరుద్ధరణ పనుల కోసం ప్రభుత్వానికి లేఖ రాసింది. దీంతో హెచ్ఎండీఏ రూ. 8కోట్లు కేటాయించగా, హోం నిధులు మరో రూ. 4కోట్లు వెచ్చించాలని నిర్ణయించారు. దంగు సున్నంతో మరమ్మతు పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే పలు పనులు ప్రారంభించగా, కీలక సివిల్ వర్క్స్ సంబంధించిన టెండర్ ప్రక్రియ కూడా తుది దశకు చేరుకుంది. త్వరలోనే ఈ పనులు పూర్తి చేసి భవనానికి పూర్వ వైభవం తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు.

అత్యాధునిక సౌకర్యాలు



అనాథ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబుద్ధులు నేర్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ. 18లక్షల వ్యయంతో అత్యాధునిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. జిమ్, గార్డెన్ కోసం మరో రూ. 56లక్షలు వెచ్చించింది. రూ. 7లక్షలతో డిజిటల్ క్లాసు రూమ్‌లను తీర్చిదిద్దింది. ఇక్కడి గ్రంథాలయంలో సుమారు పదివేల పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

– ప్రభుదాస్, ప్రిన్సిపాల్, వీఎం హోం

చిన్నారుల చదువుల కోసం..



చిన్నారుల చదువుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. చారిత్రాత్మక భవనాన్ని కాపాడుకునేందుకు ఎన్ని నిధులైనా సమకూర్చుతాం. హోంలో చదివే అనాథ బాలలకు అండగా ఉంటాం. ఉన్నత చదువుల కోసం భవనానికి ఆధునీకరణ పనులు చేపట్టాం. రూ. 12 కోట్లతో పనులు చేపట్టాం.

– సబితారెడ్డి, విద్యాశాఖ మంత్రి

యువతిపై జిమ్ ట్రైనర్ లైంగికదాడి

ఫిలింనగర్: జిమ్‌కు వచ్చిన ఓ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా ఆమెపై లైంగికదాడికి పాల్పడిన జిమ్ ట్రైనర్ పై ఫిలింనగర్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... టోలిచౌకీ ప్రాంతంలో ఆసిమ్ అనే యువకుడు జిమ్ నిర్వహిస్తున్నాడు. ఏడాదిగా జిమ్‌కు వస్తున్న యువతిపై కన్నేసిన అతను ఆమెపై గురువారం లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఫొటో మార్ఫింగ్ చేసి బెదిరింపులు

లోన్ యాప్ నిర్వాహకుల దారుణం

బంజారాహిల్స్: లోన్ యాప్ ద్వారా అప్పు తీసుకున్న ఒక మహిళ ఫొటోను మార్ఫింగ్ చేసి నిర్వాహకులు బెదిరింపులకు పాల్పడటంతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీకృష్ణ నగర్‌కు చెందిన మహిళ ఈ నెల 9న ×క్విక్ ఈజీ మనీ× అనే లోన్ యాప్ ద్వారా రూ. 5000 రుణంగా తీసుకుంది. ఇందుకోసం తన ఆధార్, పాన్ కార్డ్ వివరాలతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు అందజేసింది. 15వ తేదీలోగా డబ్బులు తిరిగి చెల్లించాలన్న యాప్ నిర్వాహకుల సూచన మేరకు ఆమె 14నే రుణాన్ని తిరిగి చెల్లించింది. అందుకు సంబంధించి ఆమె ఫోన్‌కు మెసేజ్ కూడా వచ్చింది. కాగా యాప్‌కు చెందిన ఓ వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి డబ్బులు తమకు అందలేదని, డబ్బులు చెల్లించాలంటూ బెదిరింపులకు దిగాడు. అంతేగాక ఆమె ఫొటోను మార్ఫింగ్ చేసి పలు నెంబర్ల నుంచి ఆమె వాట్సాప్ నంబర్‌కు పంపాడు. డబ్బులు చెల్లించకపోతే వాటిని సోషల్ మీడియా లో పెడతానంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితురాలు తన భర్తతో కలిసి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నందివనపర్తిని ఆదర్శంగా నిలుపుతాం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: నందివనపర్తి గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా నిలుపుతామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నందివనపర్తిలో రూ. 3కోట్ల నిధులతో సీసీ రోడ్డు, కమ్యూనిటీ భవనాల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని పురాతన ఆలయాల పునర్నిర్మాణం, నూతన ఆలయాలతో పూర్వ వైభవం ఖాయమని పేర్కొన్నారు. గ్రామంలో గడిచిన ఏడెళ్ల కాలంలో రూ. 15 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. తాజాగా రూ. కోటికి పైగా రోడ్డు భవనాల శాఖ నిధులతో గ్రామంలోని ప్రధాన చౌరాస్తాలో కిలో మీటర్ మేరా సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. త్వరలోనే యాచారం – మీరాఖాన్‌పేట, నందివనపర్తి – నక్కర్తమేడిపల్లి గ్రామం వరకు ఫార్మాసిటీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమవుతాయని అన్నారు. ఫార్మాసిటీ రోడ్డు ఏర్పాటుతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. వ్యవసాయ భూములు ఎవ్వరూ అమ్ముకోవద్దని, రూ. కోట్లల్లో ధరలు పెరుగుతాయని పేర్కొన్నారు. నందివనపర్తి గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి రూ. 25లక్షలు మంజూరు చేస్తానన్నారు. అంతకు ముందు తక్కళ్లపల్లి తండాలో పంచాయతీ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుకన్య, జెడ్పీటీసీ జంగమ్మ, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ సుచరిత, సర్పంచ్ ఉదయశ్రీ, ఎంపీటీసీ రజిత, మాజీ సర్పంచ్ రాజు నాయక్, బీఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి, ఎంపీపీ సుకన్య

బైక్‌కు మంటలు

నందిగామ: బైక్ వెనుక భాగంలో దుస్తుల బ్యాగ్ తగిలించుకొని వెళ్తుండగా సైలెన్సర్ వేడికి ఆ బ్యాగ్‌కు మంటలు వ్యాపించి బైక్ కాలిపోయింది. ఈ ఘటన మండలంలోని చాకలిగుట్ట తండా సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు చెప్పడానికి ఇష్టపడని దంపతులు బైక్‌పై షాద్‌నగర్ వైపు నుంచి హైదరాబాదు వైపునకు వెళ్తున్నారు. బైక్ వెనుక ఉంచిన దుస్తుల బ్యాగ్‌కు సైలెన్సర్ వేడికి మంటలు వ్యాపించాయి. మంటల తీవ్ర రూపం దాల్చడంతో ఆ మార్గంలో వెళ్తున్న కొందరు గమనించి బైక్‌పై వెళ్తున్న వారికి చెప్పారు. దీంతో ఆ దంపతులు బైక్‌ను ఆపేశారు. మంటలు తీవ్ర రూపం దాల్చడంతో నీళ్లు చల్లి ఆర్పారు. బైక్‌పై వెళ్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.



కాలిపోతున్న దుస్తుల బ్యాగ్, బైక్

గ్రామాల్లో భక్తిభావం వెల్లివిరియాలి



పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వెంకటరమణారెడ్డి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామాల్లో భక్తిభావం వెల్లివిరియాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తులేకలాన్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో గొడవలకు నిలయమైన గ్రామాలు నేడు ప్రశాంతంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. యువత వ్యసనాలు మాని దైవచింతన వైపు మొగ్గు చూపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి, ఎంపీటీసీ నాగమణి, ఉప సర్పంచ్ రాజిరెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు, మాజీ సర్పంచ్ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

లోకేషన్ ఆధారంగా 1930 రెస్పాన్స్!

- ఒకప్పుడు టెలికాం సర్కిల్ బేస్ట్ సేవలు
- ఇబ్బంది పడిన అనేక మంది బాధితులు
- ప్రస్తుతం లోకేషన్ విధానానికి అప్‌డేట్
- ఈ కీలక మార్పుతో 'ఇతరులకు' ఊరట



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల్లో బాధితులుగా మారిన వారికి సహాయం చేసేందుకు కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) ఏర్పాటు చేసిన 1930 నెంబర్ హెల్ప్‌లైన్ సాంకేతిక పరిజ్ఞానం అప్‌డేట్ అయింది. కొద్ది రోజుల క్రితం వరకు టెలికం సర్కిల్ ఆధారంగా ఫోన్ కాల్స్ రూట్ అవుతుండగా... ప్రస్తుతం అది లోకేషన్ ఆధారితంగా మారింది. దీంతో ఓ రాష్ట్రంలో తీసుకున్న ఫోన్ నెంబర్‌తో మరో రాష్ట్రంలో ఉంటున్న బాధితులకు భారీ ఊరట లభించింది.

అహర్నిశలూ అందుబాటులో ఉండేలా...

ఆర్థికంగా నష్టపోయిన సైబర్ క్రైమ్ బాధితులు ఎంత త్వరగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే అంత ఎక్కువ రికవరీకి ఆస్కారం ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఠాణాకు వచ్చి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు కొంత సమయం పట్టడంతో పాటు పని వేళలు అంశమూ ప్రభావం చూపుతుంది. దీంతో సైబర్ నేరగాళ్లు తాము కాజేసిన మొత్తాన్ని వివిధ బ్యాంకు ఖాతాలు, వాలెట్స్‌లోకి మార్చడమో, డ్రా చేయడమో జరిగేది. ఆపై కేసు నమోదై, నిందితుడు చిక్కినా రికవరీలు సాధ్యమయ్యేవి కాదు. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం సైబర్ నేరాల్లో బాధితులకు 24 గంటలూ అందుబాటులో ఉండేలా 1930 నెంబర్‌తో హెల్ప్‌లైన్ అందుబాటులోకి తీసుకువచ్చింది. రాష్ట్రానికి సంబంధించి బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (ఐసీసీసీ) ఉన్న తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) ఆధీనంలో పని చేస్తోంది.

తీవ్ర జాప్యంతో పాటు ఇబ్బందులు...

ఈ నెంబర్‌కు బాధితుడు చేసే ప్రతి ఫోన్ కాల్ తొలుత గుర్‌గావ్‌లో ఉన్న ప్రధాన కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. అక్కడి నుంచే దేశంలోని ఆయా ప్రాంతాల్లోని స్థానిక కాల్ సెంటర్ల రూట్ అవుతుంది. ఇదంతా కొన్ని సెకన్ల సమయంలోనే పూర్తవుతుంది. ఓ ఫోన్ కాల్‌ను ఏ ప్రాంతానికి రూట్ చేయాలనేది కొన్ని రోజుల క్రితం వరకు టెలికం సర్కిల్ ఆధారంగా జరిగేది. అంటే హెల్ప్ లైన్‌కు కాల్ చేసిన బాధితుడు వినియోగిస్తున్న ఫోన్ నెంబర్ ఏ రాష్ట్రం నుంచి జారీ అయిందో ఆ రాష్ట్రంలోని కాల్ సెంటర్‌కు రూట్ అయ్యేవి. మహారాష్ట్రలో తీసుకున్న ఫోన్ నెంబర్‌ను ఆ వ్యక్తి వేరే రాష్ట్రంలోనూ ఉంటూ వాడుతుండొచ్చు. అయితే ఈ విధానం వల్ల కాల్ మాత్రం మహారాష్ట్రకే రూట్ అయ్యేది. ఈ కారణంగా బాధితుడి నుంచి విషయం తెలుసుకుని మళ్లీ మరో కాల్ సెంటర్‌కు బదిలీ చేయడంతో కొంత జాప్యం, ఇబ్బందులు ఉండేవి. ఈ విషయాన్ని కొందరు బాధితులు ఇచ్చిన ఫీడ్ బ్యాక్ ద్వారా ఎంహెచ్ఏ గుర్తించింది.

సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి...

ఈ తరహా బాధితులు ఫిర్యాదు చేయడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఏర్పడుతున్న జాప్యాన్ని నివారించడానికి ఎంహెచ్ఏ గుర్‌గావ్‌లోని ప్రధాన కంట్రోల్ రూమ్ సాఫ్ట్‌వేర్‌లో మార్పు చేసింది. దీన్ని అప్‌డేట్ చేయడం ద్వారా ఫోన్ చేసిన బాధితుడి ఫోన్ నెంబర్‌కు సంబంధించిన టెలికాం సర్కిల్ కాకుండా అతడు ఉన్న లోకేషన్ గుర్తించేలా చేయగలిగింది. దీంతో బాధితుడు ఎక్కడ నుంచి కాల్ చేస్తున్నాడో ఆ రాష్ట్రానికి సంబంధించిన సెంటర్‌కే ఈ కాల్ రూట్ అవడం ప్రారంభమైంది. ఫలితంగా ఫోన్ చేసిన వ్యక్తికి ఇబ్బంది, జాప్యం రెండూ తగ్గాయి. 1930కు కాల్ చేసిన ఇతర నేరాల బాధితుల ఫోన్లు ఆయా ఠాణాలకు, 100కు ఫోన్ చేసిన సైబర్ నేర బాధితుల కాల్స్ 1930కు బదిలీ అయ్యేలా మార్పులు చేశారు. దేశంలోని అన్ని కాల్ సెంటర్లలో ఈ మార్పుచేర్పులు అమలులోకి వచ్చాయి. ఉదాహరణకు తెలంగాణ నుంచి ఢిల్లీ వెళ్లిన వ్యక్తి అక్కడ సైబర్ నేరం బారినపడి ఫోన్ చేస్తే... ఆ ప్రాంతంలోని కాల్ సెంటర్‌కే వెళ్లేందుకు ఈ విధానం ఉపకరిస్తుంది.

సగానికి పైగా స్టేటస్ కాల్సే...

బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఉన్న 1930 కాల్ సెంటర్‌లో 24 గంటలూ అందుబాటులో ఉండటానికి 30 మందిని కేటాయించారు. వీరు తమకు వచ్చే ఫోన్ కాల్స్‌ను నిర్వహించడానికి ఎక్సోటెల్ అనే సాఫ్ట్‌వేర్ వాడుతున్నారు. ఈ కాల్ సెంటర్‌కు నిత్యం వస్తున్న ఫోన్లలో 60 శాతం స్టేటస్ కాల్సే ఉంటున్నాయి. అంటే... గతంలో ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన వ్యక్తి తన ఫిర్యాదు ఏ స్థితిలో ఉందో, పోగొట్టుకున్న నగదు ఏమైందో తెలుసుకోవడానికి ఫోన్లు చేస్తున్నారు. దీన్ని పరిగణలోకి తీసుకున్న అధికారులు ఈ స్టేటస్‌ను బాధితులు తెలుసుకోవడానికి మరో విధానం అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నారు. మరోపక్క సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీలకు సమ ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రంలో ఏర్పడిన టీఎస్‌సీఎస్‌బీకి కేంద్రం ఐదు రాష్ట్రాల సమన్వయం బాధ్యతలు అప్పగించింది. దీంతో కర్ణాటక, గోవా, రాజస్థాన్, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల అధికారులకూ సైబర్ నేరాల విషయంలో అవసరమైనప్పుడు ఈ బ్యూరో సేవలు అందిస్తుంది.